నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 29 జనవరి 2024 | NIZAMABAD


ఖాదర్ ఇంటిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

## మత్తుమందు చల్లి..బంగారం చోరీ

**బాన్సువాడలో ఘటన**

బాన్సువాడ టౌన్, జనవరి 28: పట్టణంలోని ఓ నగల వ్యాపారిపై దుండగులు మత్తుమందు చల్లి బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు.. బాన్సువాడ పట్టణంలోని జెండాగల్లీలో ఉన్న శ్రీ శివదుర్గ నగల దుకాణానికి ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చారు. దర్గాలో సమర్పించడానికి ఒక గురిజ బంగారం కొనుగోలు చేశారు. బిల్లు తీసుకుంటుండగా నగలదుకాణం యజమాని నాగులగామ విఠల్‌ను మాటల్లో పెట్టిన దుండగులు ఆయనపై మత్తుమందు చల్లారు. 15 నిమిషాల తర్వాత స్పృహలోకి వచ్చిన యజమానికి దుకాణంలో బంగారం దాచుకునే స్టీల్‌డబ్బా కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు 91 గ్రాముల బంగారం దోచుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొనగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## పదవి లేకున్నా ప్రజల్లోనే ఉంటా..

మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్
నిరుపేద దివ్యాంగుడు ఖాదర్ గృహప్రవేశం
ఇంటిని ప్రారంభించిన గంప గోవర్ధన్

కామారెడ్డి, జనవరి 28: తాను పదవిలో లేకపోయినా ప్రజల్లోనే ఉంటానని, ప్రజలకు సేవలందిస్తానని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి శివారు పాత రాజంపేట రైల్వేగేట్ పక్కన నిరుపేద దివ్యాంగుడు షేక్ ఖాదర్ ఇంటిని గంప గోవర్ధన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం షేక్ ఖాదర్‌కు తన సొంత డబ్బు రూ.9లక్షలతో ఇంటిని నిర్మించి ఇచ్చానన్నారు. ప్రజా సేవలోనే సంతృప్తి ఉంటుందన్నారు. అనంతరం ఇల్లు కట్టించి ఇవ్వడంపై హర్షం వ్యక్తంచేస్తూ షేక్ ఖాదర్‌తోపాటు కుటుంబసభ్యులు గంప గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎంకే ముజీబుద్దీన్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, కౌన్సిలర్ ఆకుల రూపారవికుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పిప్పిరి వెంకటి, ఉపాధ్యక్షుడు కుంబాల రవి, డైరెక్టర్ రాజు, కౌన్సిలర్లు, గోపీగౌడ్, గైని శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ రామాగౌడ్, సర్పంచులు జ్ఞానేశ్వర్,రవితేజా గౌడ్, రవి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


ఖాదర్ కుటుంబసభ్యులకు కొత్త బట్టలు పెడుతున్న గంప గోవర్ధన్

# పల్లెల్లో 'ప్రత్యేక' పాలన

31తో ముగియనున్న జీపీ పాలకవర్గాల గడువు

మాజీలుగా మారనున్న సర్పంచులు
పంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో అసాధ్యమే
స్పష్టం చేసిన పంచాయతీరాజ్ మంత్రి సీతక్క
అధికారుల చేతుల్లోకి రానున్న పవర్
పాలన స్తంభించే అవకాశం



ఖలీల్‌వాడి, జనవరి 28: పల్లెల పాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లనున్నది. గ్రామ పంచాయతీ పాలక మండళ్ల గడువు ఈ నెల 31తో ముగియనున్నది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సంసిద్ధంగా లేదు. మరోవైపు, సర్పంచుల పదవీకాలం పొడిగించే అవకాశమున్నా ఆసక్తి చూపడం లేదు. బదులుగా పాలనా పగ్గాలను ప్రత్యేక అధికారులకు అప్పగించాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. అందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. విభాగాల వారీగా అధికారులను గుర్తించడం కూడా దాదాపు పూర్తయింది. ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేక అధికారుల సారథ్యంలోనే పాలన కొనసాగనున్నది. అయితే, స్పెషలాఫీసర్లు వస్తే అభివృద్ధి ఆగిపోతుందని, పనులు ఎక్కడికక్కడే నిలిచి పోతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పట్లో ఎన్నికలు కష్టమే..**

నిజామాబాద్ జిల్లాలో 530 గ్రామపంచాయతీలు, కామారెడ్డి జిల్లాలో 526 జీపీలు ఉన్నాయి. ఆయా పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి 1వ తేదీన కొలువుదీరిన పాలకవర్గాల గడువు ఈ నెల 31తో ముగియనున్నది. అయితే, గడువు తీరేలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖత చూపడం లేదు. ఇటీవలే అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం స్థానిక సంస్థలను ఎదుర్కొనేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని మంత్రి సీతక్క ఇటీవల స్పష్టం చేశారు. దీంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. లోక్‌సభ ఎలక్షన్ల తర్వాతే స్థానిక సంస్థల సమరానికి ప్రభుత్వం తెర తీయనున్నట్లు భావిస్తున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను ఆపలేదు. గడువులోపు ఎన్నికలు నిర్వహించింది. కానీ అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం లోకల్ బాడీ ఎలక్షన్ల నిర్వహణకు సుముఖత చూపడం లేదు. మరోవైపు, సర్పంచుల గడువు పొడిగించేందుకు అవకాశమున్నా ఆ దిశగా ఆలోచించడం లేదు.

**మండలాల వారీగా జాబితాలు..**

పాలకమండళ్ల గడువు ముగియనుండడంతో ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సర్కారు నిర్ణయించింది. ఆ మేరకు అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే విభాగాల వారీగా అధికారులను గుర్తించి, వారికి బాధ్యతలు అప్పగించేందుకు సన్నాహాలు చేపట్టారు. ప్రత్యేక అధికారులను నియమించేందుకు మండలాల వారీగా అధికారుల జాబితాను ఇప్పటికే రూపొందించారు. తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ ఏఈలతో పాటు ఎంపీవోలు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, సూపర్‌వైజర్లతో కూడిన జాబితాను సిద్ధం చేశారు. ఆయా అధికారులకు గ్రామాల వారీగా బాధ్యతలు అప్పగించనున్నారు.

**స్తంభించనున్న పాలన..**

ప్రత్యేక అధికారుల నియామకంతో గ్రామాల్లో అభివృద్ధి స్తంభించి పోతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజల ద్వారా ఎన్నికైన పాలకవర్గాలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయి. అభివృద్ధి పనులతో పాటు మౌలిక వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి సారిస్తాయి. అయితే, ప్రత్యేక అధికారులకు పల్లె పాలన అప్పగించడం ద్వారా పనులు కుంటుపడే అవకాశముంటుంది. అధికారులు తమ శాఖల బాధ్యతల నిర్వహణలోనే బిజీగా ఉంటారు. వారికి గ్రామాలను అప్పగించడంతో వారిపై పని ఒత్తిడి పెరిగి, ఏ బాధ్యతను కూడా సరిగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడుతుంది.

**'ప్రత్యేక' ప్రణాళికలు సిద్ధం..**

ఈ నెలాఖరుతో సర్పంచుల పదవీకాలం ముగియనున్నది. గ్రామాల్లో పాలనకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 530 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించనున్నాం. ఇప్పటికే అధికారుల జాబితాను కూడా రూపొందించాం.

- జయసుధ, డీపీవో, నిజామాబాద్



## తైక్వాండోలో సత్తాచాటిన ఇందూరుబిడ్డ

**అంతర్జాతీయ స్థాయిలో రజత పతకం**

సిరికొండ, జనవరి 28: థాయిలాండ్‌లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్‌లో నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం హుస్సేన్‌నగర్ పంచాయతీ పరిధిలోని లొంక తండాకు చెందిన బదావత్ వినోద్ నాయక్ రజత పతకం సాధించాడు. భారత దేశానికి రజత పతకం సాధించినందుకు చాలా గర్వపడుతున్నానని వినోద్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



థాయిలాండ్‌లో రజత పతకం సాధించిన వినోద్

## గ్రామాలను అభివృద్ధి చేస్తా..

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు


మర్కల్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

సదాశివనగర్, జనవరి 28: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దు తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. సదాశివనగర్ మండలంలోని మర్కల్ గ్రామంలో ఆదివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు, తండాలకు నిధులు తీసుకొచ్చి రోడ్లు, మురికి కాల్వలను నిర్మిస్తామన్నారు. మర్కల్‌లో రూ. 25లక్షలతో సీసీ రోడ్లు, మురికి కాల్వల సీసీ కోసం రూ.10 లక్షలతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. చెరువు కట్టపై పనుల కోసం జీపీ నిధులు రూ. లక్షా50 వేలతో పనులు చేస్తామన్నారు. త్వరలో 200 యూనిట్ల ఉచిత కరెంట్ అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సమస్యల పరిష్కారానికి తన వద్దకు నేరుగా రావాలని, లీడర్లతో రావొద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జూకంటి సంగారెడ్డి, ఉప సర్పంచ్ రాజు, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు లింగాగౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాగయ్య, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సంపత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మొరం అక్రమ తవ్వకాలపై దాడులు

జేసీబీ, ఏడు ట్రాక్టర్లు సీజ్
పోలీసుల అదుపులో ఎనిమిది మంది



టాస్క్‌ఫోర్స్ టీమ్ సీజ్ చేసిన వెహికిల్స్

వినాయక్‌నగర్,జనవరి 28: జిల్లాలోని ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నారన్న సమాచారం తో ఆదివారం టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించి, ఎనిమిదిమందిని అదుపులోకి తీసుకుంది. ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డి పల్లి శివారులో మొరం తవ్వుతున్న స్థావరం పై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర రాజు ఆధ్వర్యంలో సీఐ అంజయ్య సిబ్బందితో కలిసి దాడిచేశారు. దాడిలో అక్కడి నుంచి ఒక జేసీబీ, ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి,8 మందిని అదుపులోకి తీసుకున్నారు. సీజ్ చేసిన వాహనాలతోపాటు అదుపులోకి తీసుకున్న వారిని ఇందల్వాయి ఎస్సైకి అప్పగించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రాంచందర్, గజేందర్, ఆజాం పాల్గొన్నారు.

## మట్కాపై మరింత లోతుగా..

అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడిని విచారించిన పోలీసులు

బెట్టింగ్ ముఠా వివరాలు వెల్లడించిన నిందితుడు
కాల్‌డాటా ఆధారంగా సమాచారం సేకరణ
పరారీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్స్



వినాయక్‌నగర్, జనవరి 28: నిజామాబాద్ జిల్లా కేంద్రాన్ని అడ్డాగా చేసుకొని సాగుతున్న మట్కాపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ బాస్ నిర్ణయించారు. ఇందులో భాగంగానే వారం రోజుల క్రితం కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఐదేండ్లుగా చాపకింద నీరులా మట్కాను కొనసాగించిన మహ్మద్ జమీర్ అనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం జమీర్‌ను కస్టడీలోకి తీసుకొని విచారించిన పోలీసులు.. అతనితో సంబంధాలు ఉన్న, లావాదేవీలు జరిపిన మిగతా ఏజెంట్లతో పాటు పార్ట్‌నర్లు, సభ్యుల వివరాలను తెలుసుకున్నారు. నిందితుడు ఇచ్చిన వివరాల ఆధారంగా ప్రత్యేక పోలీసు బృందాలు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నాయి.

**ఎఫ్ఐఆర్‌లో నిజామాబాద్, మహారాష్ట్ర ఏజెంట్ల పేర్లు..**

పోలీసుల కస్టడీలో ఉన్న అంతర్రాష్ట్ర మట్కా బెట్టింగ్ నిర్వాహకుడు ఇచ్చిన సమాచారంతో నిందితులను పట్టుకునేందుకు సీపీ కల్మేశ్వర్ ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుడు మహారాష్ట్రలోని నాందెడ్, ధర్మాబాద్, బిలోలి, వర్ధ, అకోలా, అమరావతి తదితర ప్రాంతాల్లో ఉన్న మట్కా నిర్వాహకుల పేర్లు తెలుపడంతో నార్త్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో సంబంధిత ఐదో టౌన్ పోలీసులు మిగతా నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. సుమారు 10 కన్నా ఎక్కువ మంది మట్కా బెట్టింగ్‌లో పాత్రధారులుగా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు సైతం నిందితుడితో లావాదేవీలు నిర్వహించినట్లు తేలడంతో వారి పేర్లను సైతం పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. దీంతో మిగతా నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. మరోవైపు నిందితుడు జమీర్ కూడబెట్టిన ఆస్తుల వివరాలు తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

**మట్కా ఏజెంట్ల నమ్మి మోసపోవద్దు**

జిల్లా ప్రజలు మట్కా ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు. మట్కా ఆడినా, నిర్వహించినా, బుకీలుగా వ్యవహరించిన వారిపై చట్టరీత్యా తీవ్రమైన చర్యలు తీసుకుంటాం.

- కల్మేశ్వర్ సింగేనవార్, సీపీ, నిజామాబాద్





**చెట్టంత పూత**

మరికొన్ని రోజుల్లో శీతాకాలం ముగిసి వేసవికాలం రానున్నది. పుష్య మాసం ముగిసి మాఘ మాసం సమీపిస్తున్న తరుణం..మామిడి పూత వచ్చే సమయం.. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం అడ్కాస్‌పల్లి సమీపంలోని లింగమయ్య ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న ఓ తోటలో మామిడి చెట్టుకు పూత విరగకాసింది. దూరం నుంచి చూసే వారికి ఆకులు కూడా కనిపించడం లేదు. ఈ దారిగుండా వెళ్లేవారంతా ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- కోటగిరి, జనవరి 28

## తప్పుడు ప్రచారం నమ్మొద్దు

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్

చందూర్, జనవరి 28: తాను పార్టీ మారే ప్రసక్తే లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్‌లోకి వెళ్తున్నానంటూ సోషల్‌మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియాలో కొనసాగుతున్న ప్రచారాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు నమ్మవద్దని ఆయన సూచించారు.